ప్రజాశక్తి

శుక్రవారం 24 మార్చి 2023 5 విజయనగరం

కెజిబివిల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో 6, 11వ తరగతుల్లో ప్రవేశం కోసం, 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తు న్నట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 26 కెజిబివిల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ఆన్‌లైన్‌లో దర ఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 27 నుంచి ఏప్రిల్ 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అనాథలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, బిపిఎల్ బాలికలు మాత్రమే దర ఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తామని చెప్పారు. దరఖాస్తును 'హెచ్ టిటిపిఎస్://ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్. ఐఎన్' సైట్ ద్వారా పొందవచ్చునన్నారు. ఎంపికైన విద్యార్థుల కు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుందని తెలిపారు.సంబంధిత పాఠశాల నోటిఫికేషన్ బోర్డులో నేరుగా చూడవచ్చుని, సందేహాలు ఉంటే 9000204925 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మతోన్మాదం, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా..

భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమిద్దాం

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, యుటిఎఫ్ సహా పలు ప్రజాసంఘాల నాయకుల ప్రతిజ్ఞ

నగరంలో కాగడాల ప్రదర్శన ● జిల్లా అంతటా ఘనంగా వర్ధంతి సభలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదం, సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ఉద్యమించి దేశ ప్రజలను రక్షిస్తామని ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, డివైఎఫ్ఐ నాయకులు ప్రతిన బూనారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక కోట జంక్షన్ నుంచి గంట స్తంభం వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. మతోన్మాదం, సామ్రాజ్యవాదం నశించాలని, భగత్ సింగ్ కోరుకున్న లౌకిక ప్రజాస్వామ్య దేశం కోసం ఉద్యమిస్తామని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు పి.రామ్మోహన్, జెఎవిఅర్‌కె ఈశ్వరరావు మాట్లాడారు. సామ్రాజ్య వాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన పోరాట యోధుడు భగత్ సింగ్ అని అన్నారు. నేడు దేశంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సామ్రాజ్య వాదాన్ని ప్రోత్సహిస్తూ, మతం పేరుతో ప్రజలను ఐక్యం కాకుండా మత ఛాందస భావాలతో రెచ్చగొట్టి దేశాన్ని దోపిడీదార్ల చేతుల్లో పెడుతోందన్నారు. ఎన్ఇపి పేరుతో పేదలకు ప్రభుత్వ విద్య అందకుండా చేస్తుందన్నారు. దేశ స్వావలంబన కోసం, ఫెడరల్ వ్యవస్థను కాపాడుకునేందుకు, విద్య, ఉపాధి అవకాశాల కోసం, రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రదర్శనలో ఎస్ ఎఫ్ఐ, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, రమేష్ పట్నాయక్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రుద్ర ప్రతాప్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల బాటలో నడవాలి

కార్పొరేటీకరణ, మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమిద్దామంటూ సిపిఎం, పలు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు స్థానిక ఎల్ బి జి భవనంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వతంత్రం కోసం భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్‌లు యవ్వన దశలోనే తెల్లదొరలపై తిరగబడి తృణప్రాయంగా చిరునవ్వుతో ఉరికంబానికి వేలాడిన గొప్ప త్యాగధనులని అన్నారు. నేడు బిజెపి అధికారం చేపట్టిన తర్వాత దేశం మతోన్మాదుల, కార్పొరేట్ శక్తుల కబంధహస్తాలలో బందీగా మారిందన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తూ ప్రజలకు అబివృద్ధి పేరిట అబద్ధాలు చెబుతూ మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలంతా లౌకిక సామ్యవాద, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుకుని భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల చూపిన బాటలో అందరం నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, ఎ.జగన్మోహన్, పి.రామ్మోహన్, బి.రమణ, సిహెచ్ వెంకటేష్, వి.లక్ష్మి పాల్గొన్నారు.

గజపతినగరం : మండలంలోని పురిటిపెంట పంచాయతీ కార్యాలయం వద్ద భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి సిఐటియు నాయకులు వి.లక్ష్మి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భగత్‌సింగ్‌లాంటి దేశభక్తుల జీవిత చరిత్రలను బిజెపి ప్రభుత్వం కర్ణాటకలో పాఠ్యపుస్తకాల నుంచి తొలగించడం సిగ్గుచేటు అన్నారు. జాతీయ ఉద్యమంలో ఎటువంటి పాత్రా లేని ఆర్ఎస్ఎస్ నాయకులు, గాంధీని చంపిన గాడ్సేని గొప్ప దేశభక్తులని ప్రచారం చేయడం దుర్మార్గమని అన్నారు. భగత్‌సింగ్ కలలుగన్న ఆర్థిక స్వాతంత్ర్యం, మతసామరస్యం కోసం ప్రజలందరూ పెద్ద ఎత్తున ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు

విజయనగరం : కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు ,

కార్యక్రమంలో కృష్ణ, గోవింద, భాస్కరరావు, లక్ష్మణ, గోవింద తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట : భగత్ సింగ్, రాజగురు,సుఖ్ దేవ్ వర్ధంతిని సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటిద్దామని నవ యువ సమాఖ్య పిలుపునిచ్చింది. అంబేద్కర్ సామాజిక భవనంలో వారి చిత్రపటాలకు ఎన్‌వైఎస్ జిల్లా అధ్యక్షులు ఎం. అప్పలరాజు, పిడిఎస్ఒ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. గౌతమి, ఎన్‌వైఎస్ కన్వీనర్ బి. గిరి ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శృంగవరపుకోట : భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సిఐటియు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అమర వీరులు భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్న బాబు, డివైఎఫ్ఐ నాయకులు సిహెచ్ ముత్యాలు పాల్గొన్నారు.

వేపాడ :ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో కొండగంగుపూడిలో భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బొబ్బిలి: విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ వర్ధంతి సభ చర్చి సెంటర్లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పి.శంకరరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తవలస: వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, గొర్రె కృష్ణ, జామి రాము, ముఠా కార్మికులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఎం.బూర్జివలసలో రైతుసంఘం జిల్లాఅధ్యక్షులు ఎస్.గోపాలం, సిపిఎం నాయకులుజి.అప్పలనాయుడు, సిఐటియు నాయకులు కె.శంకర్రావు ఆధ్వర్యాన భగత్‌సింగ్ వర్ధంతి జరిగింది.

విజయనగరం : భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు; గజపతినగరంలో నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజల భాగస్వామ్యంతోనే క్షయ నివారణ

- జిల్లా క్షయ నివారణ అధికారి రామేశ్వరి ప్రభు
- నేడు ప్రపంచ క్షయ నివారణా దినోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజల భాగస్వామ్యంతోనే క్షయ నివారణ సాధ్యమవుతుందని జిల్లా టిబి కంట్రోల్ అధికారి డాక్టర్ రామేశ్వరి ప్రభు అన్నారు. జిల్లా ప్రజల్లో ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ, పలు విధాలుగా చర్యలు చేపట్టామని తెలిపారు. పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు తదితర చోట్ల ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అవగాహన కల్పించామని చెప్పారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రత్యేక సర్వేలు నిర్వహించటం ద్వారా ఉత్తమ సేవలందించారని తెలిపారు. మార్చి 24 ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవాన్ని పురస్కరించు కొని నిర్వహించబోయే కార్యక్రమాల గురించి గురువారం స్థానిక టిబి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరించారు. క్షయ లేని సమాజాన్ని నిర్మించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. 2023 జనవరి నుంచి ఫిబ్రవరి వరకు కేవలం 676 కేసులు మాత్రమే నమోదయ్యాయని, జిల్లాలో గత నాలుగేళ్ల నుంచి క్షయ వ్యాధి 20 శాతం మేర తగ్గిందని వెల్లడించారు. వ్యాధి నివారణకు సంబంధించి ప్రతి పిహెచ్‌సి పరిధిలో ఒక నోడల్ అధికారిని, అవసరమైన మేరకు మందులను అందుబాటులో ఉంచామని చెప్పారు. జిల్లాలో 1764 కేసులు నమోదవ్వగా అందులో 90 వరకు మొండి క్షయ కేసులున్నాయని చెప్పారు. 64 మంది నిక్షయ మిత్రల సహాయంతో 518 మంది క్షయ వ్యాధి గ్రస్తులను దత్తత తీసుకున్నామని, వారికి ఎప్పటికప్పుడు మందులు, ఉచిత ఆహార కిట్లను అందజేస్తున్నామని తెలిపారు.

నేడు ప్రత్యేక కార్యక్రమాలు, ర్యాలీ

క్షయ నివారణా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు రామేశ్వరి ప్రభు తెలిపారు. ఉదయం 10 గంటలకు సంతపేట పట్టణ ఆరోగ్యకేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు.అనంతరం సంతపేట యుపిహెచ్‌సిల్లో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. జిల్లాలోని ఉత్తమ సేవలందించిన సిబ్బందికి, వ్యాధి గ్రస్తులను దత్తత తీసుకొని సహాయ, సహకారాలు అందిస్తున్న నిక్షయ మిత్రలకు ప్రశంసా పత్రాలు అందజేస్తామని తెలిపారు. జిల్లా క్షయ నివారణ విభాగ జిల్లా కో-ఆర్డినేటర్ కుమార్, వైద్యులు, టిబి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు క్యాజువాలిటీ విభాగం నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు వైద్య కళాశాల లెక్చర్ గ్యాలరీలో అకడమిక్ కమిటీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ ఇడిగా సుధారాణి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎం.సుధారాణి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ఇడిగా విధులు నిర్వహించిన పద్మావతి నుంచి సుధారాణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె శ్రీకాకుళం జిల్లాలో పలు మండలాల్లో తాహశీల్దార్‌గా విధులు నిర్వహించారు. తాజాగా నందిగామ మండల తాహశీల్దార్‌గా ఉంటూ, డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొంది, జిల్లాకు ఇడిగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఇడికి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఇడి సుధారాణి

గంటేడకు 29న పతంజలి పురస్కార ప్రదానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రముఖ కవి, గేయ రచయిత గంటేడ గౌరునాయుడికి పతంజలి పురస్కారం ఈనెల 29న ప్రదానం చేయనున్నట్లు పతంజలి సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి తెలిపారు. గురువారం స్థానిక గురజాడ అప్పారావు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయుడు, పలు పత్రికలకు సంపాదకులుగా పనిచేసిన కెఎన్‌వై పతంజలి పేరున ప్రతి ఏడాది అందించే పురస్కారం ఈ ఏడాది గంటేడ గౌరునాయుడుకు బుధవారం ఉదయం గురజాడ పబ్లిక్ స్కూల్లో అందజేయనున్నట్లు తెలిపారు. స్నేహ కళా సాహితీ ని స్థాపించి ఉత్తరాంధ్ర నుండి ఎందరో కవులను, కథకులను తయారు చేసిన ఘనత గౌరునాయుడి మాస్టారికే దక్కుతుందని భీశెట్టి అన్నారు. వేదిక కార్యదర్శి ఎన్ కె బాబు మాట్లాడుతూ పతంజలి పేరుతో ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ప్రముఖ రచయితలు మోహన్, మహర్షి, దేవిప్రియ, సతీష్ చంద్ర, చింతికింది, అట్టాడ అప్పలనాయుడు, పప్పు అరుణలకు అందచేసామని, 2023లో గంటేడ గౌరునాయుడిని ఎంపిక చేశామని తెలిపారు. పురస్కార ప్రదాన కార్యక్రమంలో సాహితీవేత్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు,పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో వేదిక ప్రతినిధులు జలంత్రి రామచంద్రరాజు, ఇప్పలవలస గోపీ, గురజాడ వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయ చిహ్నం చూపుతున్న టిడిపి నాయకులు

టిడిపి నాయకుల విజయోత్సవం

విజయనగరంకోట : రాష్ట్ర అసెంబ్లీలో ఎమ్మెల్యే కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపికి చెందిన పంచుమర్తి అనురాధ విజయం సాధించడంతో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం సాయంత్రం అశోక్‌బంగ్లా వద్ద సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా పేల్చి స్వీట్లు పంచుకున్నారు. టిడిపికి తగిన ఎమ్మెల్యేల సంఖ్యాబలం లేనప్పటికీ అనూహ్యంగా వైసిపి ఎమ్మెల్యేల సహకారంతో విజయం సాధించడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు, పట్టణ కార్యదర్శి బంగారు బాబు, విజ్జపు ప్రసాద్, గంటా పోలి నాయుడు, కరణం శివరామకృష్ణ, రొంగలి రామారావు, కనకల మురళీ మోహన్, కంది మురళి నాయుడు, అభిమానులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై మోనటరింగ్ సెల్

విజయనగరం : వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని, జిల్లాలో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం తమ కార్యాలయంలో మోనటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు, జిల్లా గ్రామీణ నీటిసరఫరా పర్యవేక్షక ఇంజనీర్ బి.ఉమాశంకర్ తెలిపారు. ఈనెల 4 నుంచి ఈ సెల్ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్య 9100120711 నెంబరుకు ఫోన్ చేసి తాగునీటి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు.

మొండి బకాయిలపై ఉపేక్షించొద్దు

మున్సిపల్ ఆర్‌డి నాగరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దీర్ఘకాలిక, మొండి పన్ను బకాయిలను వసూలు చేయడంలో ఉపేక్షించవద్దని రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ నాగరాజు ఆదేశించారు. గురువారం అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ రావు ఛాంబర్‌లో పన్నుల వసూలుపై సమీక్షించారు. మొండి బకాయిలు రాబట్టడంలో జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 - 23 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులపై రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇచ్చిన అంశమై ప్రజలలో మరింత చైతన్యం తీసుకురావాలన్నారు. సచివాలయాల వారీగా ప్రతిరోజు సమీక్షలను చేపట్టి అవసరమైతే మరింత మంది సిబ్బందితో మొండి బకాయిలు రాబట్టాలని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరానికి పన్ను వసూలు లక్ష్యం రూ.43కోట్లు కాగా ఇప్పటివరకు 28 కోట్లు మాత్రమే వసూలు అయిందన్నారు. మార్చి 31వ తేదీలోగా వీలైనంత ఎక్కువ శాతం పన్ను వసూలు చేయాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డి నాగరాజు

సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కిరణ్, సాయి ప్రసాద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్తపేటలో ఉన్న శునక సంరక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ కుక్కలకు అందుతున్న సంరక్షణ చర్యలపై అడిగి తెలుసుకున్నారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అరెస్టుపై నిరసన

ప్రజాశక్తి- విజయనగరం కోట

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం తప్పుడు పరువు నష్టం కేసు బనాయించి, కోర్టులో రెండేళ్ల జైలు శిక్ష విధించినందుకు నిరసనగా కాంగ్రెస్‌నాయకులు, కార్యకర్తలు గురువారం ఆ పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. మోడీ డౌన్ డౌన్.. రాహుల్ గాంధీ వర్ధిల్లాలి, అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం అంట నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్ మాట్లాడుతూ బిజెపి నాయకులు రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు పెట్టడం, సూరత్ జిల్లా కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించడం విడ్డూరంగా ఉందని అన్నారు. మోడీని విమర్శించినందుకు జైలుకు వెళ్లాలంటే మళ్ళీ మళ్ళీ విమర్శిస్తామని అన్నారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి పెట్టింది కాంగ్రెస్ వారసులని మరోసారి గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ చైర్మన్ అబ్దుల్ రెహమాన్, డిసిసి జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, వాకాడ రమణ, అప్పలరెడ్డి ఇతర నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

తలగాం దళితులకు సాగుహక్కు కల్పించాలి

భూస్వాములకు ఇచ్చిన డి-పట్టాలు రద్దు చేయాలి ● సిపిఎం ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-వంగర

మండలంలోని తలగాం గ్రామానికి చెందిన దళితులు సర్వేనెంబర్ 6లో సాగు చేసిన భూములపై వారికే సాగు హక్కు కల్పించాలని, అదే భూమిపై భూస్వాములకు ఇచ్చిన డి పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చీపురుపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ తలగాం గ్రామానికి చెందిన కొంతమంది నిరుపేద దళితులు జీవనోపాధి కోసం గ్రామ పరిధిలో సర్వే నెంబర్ 6లో 16.73 ఎకరాలు భూమిని వారి కుటుంబ పోషణ కోసం సాగు చేసుకుంటున్నారని తెలిపారు. పంటలు సక్రమంగా పండగ పోవడం, కుటుంబ పోషణ సక్రమంగా లేకపోవడంతో వారంతా వలస వెళ్లిపోవడంతో ఇదే అదును చూసుకున్న మద్దివలస, ఎం.సీతారాంపురం, కొప్పర వలస, కొత్తవలస గ్రామాలకు చెందిన కొంతమంది భూస్వాములు దళితులు సాగు చేసిన భూములను ఆక్రమించుకొని అడ్డదారుల్లో డి-పట్టాలు పొందారని తెలిపారు. ఈ విషయంపై వలస వెళ్లి వచ్చిన దళితులు ప్రశ్నిస్తే తిరిగి దౌర్జన్యంగా దళితులను బెదిరించడం సరికాదని మండిపడ్డారు. వెంటనే అధికారులు జోక్యం చేసుకొని అగ్రకుల భూస్వాములకు ఇచ్చిన డి- పట్టాలను రద్దుచేసి దళితులకు భూ సాగు హక్కు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు, సిపిఎం నాయకులు

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి రాకోటి ఆనంద్ మాట్లాడుతూ దళితులను భయభ్రాంతులకు గురిచేసిన అగ్రకుల భూస్వాములపై చర్యలు తీసుకుని అట్రాసిటీ కేసు నమోదు చేయాలనిడిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌డిఒ అప్పారావుకు వినతి అందజేశారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ వంగర తహశీల్దార్ తో మాట్లాడి తలగాం గ్రామ దళితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అంబల్ల గౌరినాయుడు, పోరెడ్డి విశ్వనాథం, మరడాన త్రినాథ్, తలగాం దళితులు సుందర రావు, ఆనంద్, రాజారావు కృపారావు, సుమన్, రమేష్ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

నలుగురు ఇంటర్ విద్యార్థులు డిబార్

పూసపాటిరేగ : మండలంలోని కొప్పెర్ల గురుకులంలో గురువారం జరిగిన ఇంటర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతుండటంతో డి డిబార్ చేసినట్లు సిట్టింగ్ స్క్వాడ్ కృష్ణ తెలిపారు. కొప్పెర్ల పాఠశాల పరీక్షా కేంద్రంలో శ్రీ సూర్యోదయ జూనియర్ ప్రైవేట్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు, శ్రీనివాస ప్రైవేట్ జూనియర్ కళాశాలకు చెందిన ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు తెలిపారు.

బొబ్బిలిలో భారీ వర్షం

బొబ్బిలి : బొబ్బిలి, పరిసర ప్రాంతాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం మొక్కజొన్న, నువ్వులు పంటకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

విజృంభిస్తున్న జ్వరాలు

వేపాడ : మండలంలోని కేజీపూడి పంచాయతీ పరిధిలో గల బంధవలస, కోటయ్య గరువు గ్రామాలలో గిరిజనులు జ్వరాలు బారినపడి మంచాన పెట్టారు. ఇప్పటికే పదుల సంఖ్యలో గిరిజనులు జ్వరాలతో బాధపడుతూ ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయం బొద్దాం పిహెచ్‌సి వైద్యాధికారి సతీష్ కుమార్‌ని వివరణ కోరగా ఇప్పటికే పలుమార్లు గ్రామాలు పర్యటించి తగు చర్యలు చేపట్టామని, మరోసారి ఆయా గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి తగు చర్యలు చేపడతామని తెలియజేశారు.

జ్వరంతో బాధపడుతున్న బాలుడు

తాగునీటి సరఫరాకు అంతరాయం

బొబ్బిలి : బలిజిపేట రోడ్డులో నూతన పైపులైన్ పనులు, భోజరాజపురం పంపు హౌస్ సమీపంలో అంధుల పాఠశాల వద్ద పాత ప్రధాన పైపులైన్ మార్పివేయనుండడంతో ఈనెల 24 నుంచి 26 వరకు పట్టణంలోని అన్ని వార్డులకు తాగునీటి సరఫరా నిలిపివేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. బలిజిపేట రోడ్డులో నూతన పైపులైన్ వేయనుండడంతో ఈనెల 27 నుంచి 29 వరకు పట్టణంలోని 5,6,7,8,9 వార్డులలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఆయా వార్డులలో ప్రజలు ఇబ్బందులు పడకుండా మంచినీటి ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేస్తామన్నారు. తాగునీటి సరఫరా అంతరాయనికి ప్రజలు సహకరించాలని కోరారు.

రాములోరికి గోటితో ఒలిచిన తలంబ్రాలు

నెల్లిమర్ల : ఈ నెల 30న శ్రీరామనవమిని పురస్కరించుకుని లోక కళ్యాణార్ధం నిర్వహించే కల్యాణోత్సవం సంద ర్భంగా రామతీర్థం సేవా సంఘం వారు గోటితో వొలిచిన కోటి తలంబ్రాలను 2017 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం రామతీర్థం దేవాలయంలో జరిగే కళ్యాణోత్సవంలో వినియోగిస్తున్నారని సంఘ అధ్యక్ష కార్యదర్శులు రేగాన గోవిందరావు, సుదర్శనం విజయకుమార్ తెలిపారు. ఈ సంవత్సరం కూడా ఈ సంఘం ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో శ్రీరామ, లక్ష్మణ, హనుమ, అంగద జాంబవంత మొదలైన వారి వేష ధారణలతో సేద్యం చేసిన వరికంకులను కోసి ధాన్యాన్ని సిద్ధం చేశారు. ఆ ధాన్యాన్ని సంఘం ప్రతినిధులు మన రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన రామభక్తులకు పంపించారు. ఆ ధాన్యాన్ని భక్తులు ముక్కోటి ఏకాదశి నుండి శ్రీ రామనామం జపిస్తూ గోటితో ఒలుస్తూ అవి తలంబ్రాలుగా రూపాంతరం చెందించారు. ఈ గోటితో ఒలిచిన తలంబ్రాలను రఘువంశ సంజాతుని జన్మదినమైన శ్రీరామనవమి నాడు మేళతాళాలు, వేదమంత్రాల నడుమ అర్చకులకు అందచేస్తామని తెలిపారు. ఈ తలంబ్రాలనే సీతారాముల కళ్యాణోత్సవంలో అర్చకస్వాములు వినియోగిస్తారని తెలిపారు.

రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని బలపర్చండి

బొబ్బిలి : రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి ఎం.వెంకటరమణ, పిసిసి సభ్యులు ముచ్వల శ్రీనివాసరావు కోరారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కోరుతూ గురువారం రామన్న దొరవలసలో ఇంటింటి ప్రచారం చేశారు. బిజెపి పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణమోహన్, పార్వతి తదితరులు పాల్గొన్నారు,

5న ఎండిఎం కార్మికుల చలో ఢిల్లీ

విజయనగరం టౌన్ : మధ్యాహ్న భోజన పథకం(గోరుముద్ద)లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, 12 నెలలకూ వేతనాలు ఇవ్వాలని, మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు రూ. 20కు పెంచాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి సుధారాణి డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లసాధనకు ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం ఎన్‌పిఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయన్నారు. భోజన పథకం కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తుందని, పనిలో అగ్ని ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు వున్నా ఎలాంటి వైద్య బీమా సౌకర్యం లేదని అన్నారు. రోజురోజుకూ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రైమరీ విద్యార్థులకు రూ.5.88 పైసలు, అప్పర్ ప్రైమరీ/ హైస్కూల్ విద్యార్థులకు రూ.8.57 పైసలతో నాణ్యమైన భోజనం పెట్టడం ఎలా అనేది ప్రభుత్వం ఆలోచించాలన్నారు. రాగి జావ తయారు చేయటానికి వంటపాత్రలు, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చెయ్యాలన్నారు. సమావేశంలో యూనియన్ సభ్యులుఈశ్వరమ్మ, సన్యాసమ్మ, గౌరీ, లక్ష్మి, అచియమ్మ,రాజేశ్వరి,అనురాధ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో వ్యాధి నిరోధకశక్తి పెంపు

విజయనగరం: గర్భిణులు చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకుంటే వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. గురువారం విజయనగరం అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న తోట పాలెం అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులో ప్రేమ వివాహాలు, గర్భం దాల్చడం, పిల్లల్ని కనడం శ్రేయస్కరం కాదని అన్నారు. దీనివల్ల వారి భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. మంచి పోషణ విలువలతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతోపాటు అనేక రోగాల నుంచి కాపాడతాయని అన్నారు . కార్యక్రమంలో తల్లులు, అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మీ, మంగ పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైసిపి నాయకులు

టిడిపి ఆరోపణలకు నిరసనగా వైసిపి ధర్నా

విజయనగరం టౌన్: తప్పుడు ఆరోపణలు చేస్తున్న టిడిపి నాయకుల వైఖరి హాస్యాస్పదంగా ఉందని, ఆరోపణలను రుజువు చేసే సత్తా వారికి ఉందా అని వైసిపి మండల అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, జొన్నవలస పిఎసిఎస్ అధ్యక్షులు కెల్లా త్రినాధ అన్నారు. ఇటీవల టిడిపి నాయకులు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద వైసిపి నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి జన్మభూమి కమిటీల పేరుతో ప్రజాధనాన్ని దోపిడీ చేసిన సంగతి నిజం కాదా?, అమరావతి పేరుతో 1100 ఎకరాల దోపిడీ సిగ్గు సిగ్గు , పోలవరం, పట్టిసీమ దోపిడీ సిగ్గు సిగ్గు, స్కిల్ డెవలప్మెంట్ దోపిడీ సిగ్గు సిగ్గు, ద్వారపూడి, దుప్పాడ గ్రామాలలో టిడిపి నేతల భూ కబ్జాలు, అవినీతి సిగ్గు సిగ్గు అంటూ నినాదాలు చేశారు. అవినీతికి, కబ్జాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబు , టిడిపి నేతలు అని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక తమపై తప్పుడు ఆరోపణలు చేసి బురద జల్లడం సరికాదన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలలో టిడిపి నేతల భూకబ్జాలపై తగు విచారణ చేసి, చర్యలు చేపట్టాలని కోరుతూ అర్ఐకు వినతి అందజేశారు. ధర్నాలో ఆ పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కల పట్టివేతపై విచారణ జరిపించండి

విజయనగరం టౌన్: మున్సిపల్ కార్పొరేషన్ లో జరుగుతున్న కుక్కల స్కాం పై విచారణ జరపాలని గో సంరక్షణ సమైక్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం గో సంరక్షణ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కుక్కలకు ఆపరేషన్లు చేస్తామనే పేరుతో కుక్కలను చంపుతూ, ఆపరేషన్ల పేరిట వాటి కడుపు కోసేసి హింసించడం సరైనది కాదని అన్నారు. కుక్కలను హింసిస్తూ చంపుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీరాములునాయుడు, హెల్త్ ఆపిసర్ సత్యనారాయణ పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

మహిళకు గాయాలు

వేపాడ : మండలంలోని చిరుతపాలెం జంక్షన్ నుండి బికెఎన్ పేట వెళ్లే కూడలి వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ప్రమాదంలో మహిళకు గాయాలయ్యాయి. ఎస్ కోటకు చెందిన పిల్లి శివప్రసాద్, కుమారి దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి ద్విచక్ర వాహనంపై కె.కోటపాడు వెళుతుండగా చిరుతపాలెం కూడలి వద్ద కింద పడిపోయారు. రోడ్డు గుంతలు పడటంతో బండి అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కుమారికి గాయాలు కాగా 108లో గ్రామస్తులు ఎస్ కోట ఆసుపత్రికి తరలించారు.

నాణ్యతా లోపంతో బీటలు వారిన రోడ్డు

వేపాడ : సోంపురం జంక్షన్ నుండి వేపాడ మీదుగా ఆనందపురం వరకు రోడ్డు విస్తరణ పేరట నిర్మిస్తున్న నిర్మాణం పనులు నాణ్యత లోపం వల్ల బీటలు వారింది. గత నాలుగు రోజులుగా కురిసిన చిన్నపాటి వర్షానికి రోడ్డు బీటలు వారడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా వేసిన మట్టి కూడా జారిపోయింది. బక్కు నాయుడుపేట జంక్షన్ నుండి నీలకంఠ రాజపురం వరకు చేపట్టిన రోడ్డు పనులు పరిస్థితి అలాగే ఉంది. రోడ్డుకు వేసిన బెర్మలు జారిపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నెలరోజులు కూడా కాకముందే రోడ్డు ఈ విధంగా తయారవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

కూలీలకు 'ఉపాధి' కష్టాలు

- ఎన్ఎంఎంఎస్ యాప్ కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి..
- సిగ్నల్ లేకపోయినా, కూలీల హాజరు, ఫోటో పంపకపోయినా వేతనం కట్
- కానరాని తాగు నీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ల జాడ

ప్రజాశక్తి- రేగిడి

పేద, బడుగు, బలహీన వర్గాల వారికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వాలు పనులు కల్పిస్తుంది. కాని కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనుల్లో ఎన్ఎంఎంఎస్ నూతన సాంకేతకత యాప్ ప్రవేశ పెట్టడంతో ఉపాధి కూలీలకు కష్టాలు తప్పడం లేదు. వాస్తవంగా పనులు చేసిన గ్రామం నుండి వేతనదారుల పనులకు సంబంధించి కూలీల హాజరు, ఫోటో తప్పనిసరిగా ఆయా సంఘాల మెట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు యాప్ ద్వారా పంపించాలి. సిగ్నల్ సమస్య తలెత్తడంతో పాటుగా మేట్లు కొన్ని సందర్భాల్లో తప్పుడు నివేదిక ఇవ్వడంతో ఈ యాప్ ద్వారా ఎన్నో గ్రామాల్లో పనులు చేస్తున్న కూలీలు వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. పనులు చేసినప్పటికీ బ్యాంకు ఖాతాలో కూలి జమ కాలేదని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019 ముందు వేతనదారులకు తాగునీటి అలవెన్స్, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అప్పటి ప్రభుత్వాలు అందించేవని, గత ఏడాది నుంచి ఎంఎంఎస్ యాప్ కొత్త విధానం రావడంతో ఉపాధి కూలీలకు పనులు వద్ద ఎటువంటి సౌకర్యాలు లేవని కూలీలు వాపోతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో పనులు చేస్తున్న ఉపాధి హామీ పథకం కూలీలు మండల, డివిజన్, జిల్లా కేంద్రాలకు స్పందనలో ఫిర్యాదులు చేస్తున్నారు. ఈ యాప్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడంతో అధికారులు ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది.. దీంతో ఉపాధి కూలి అందక వేతన దారులు లబోదిబోమంటున్నారు.

ఎండలోనే సేద తీరుతున్న ఉపాధి కూలీలు

పనుల వద్ద అసౌకర్యాలు

మండలంలోని 39 గ్రామ పంచాయతీలో 51 రెవెన్యూ గ్రామాలతో పాటు మరో 16 హేబటేషన్ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ పనుల వద్ద సౌకర్యాలు లేక కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వేసవి ఉష్ణోగ్రతలు కారణంగా ఎండలతో పాటు ఉక్కబోత ఎక్కువగా ఉన్నప్పటికీ పనులు వద్ద తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు లేని పరిస్థితి నెలకొంది. కూలీలు వీటి విషయం అధికారులకు అడిగినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నూతన విధాన యాప్‌తో ఇవ్వడం లేదని చెబుతున్నారు.

అసౌకర్యాల నడుమ ఉపాధి హామీ పనులు

నెల్లిమర్ల: మండలంలో ఉపాధి హామీ పనులు సౌకర్యాల కొరతతో జరుగుతున్నాయి. గతంలో ఉపాధి పనులు జరిగే చోట ప్రభుత్వం సౌకర్యాలు కల్పించేది. ప్రస్తుతం జరుగుతున్న పనుల్లో కనీసం టెంట్లు, తాగు నీరు సౌకర్యం కూడా కల్పించలేదు. దెబ్బలు తగిలితే ప్రథమ చికిత్సకు కూడా వేతనదార్లు నోచుకోవడం లేదు. కొన్ని గ్రామాల్లో అరకొర టెంట్లు వేస్తున్నారు. గాని పూర్తి స్థాయిలో కూలీలకు నీడ లేకుండా పోతుంది. కాగావేతన దార్లు ఉదయం పనులకు బయలు దేరినప్పుడు ఎవరి నీరు వారే తీసుకు వెళ్తున్నామని చెబుతున్నారు. గతంలో పనులు జరిగే చోట పూర్తి స్థాయిలో టెంట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు, తాగు నీరు వంటి సౌకర్యాలు కల్పించేవారు. ప్రస్తుతం వాటి జాడే కనిపించకపోవడంతో కూలీలు వడదెబ్బకు గురవుతున్నారు. పనిచేసే చోట సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు

మోసగించి భూములు లాక్కున్నారు !

- జగనన్న కాలనీల కోసం పేదల భూములు లాక్కున్న అధికారులు
- పెత్తందారులను వదిలేసి సామాన్యులపై పడడంతో తిరుగుబాటు
- తమ భూమిని ఇవ్వాలని అడ్డగింత

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ఎకరాలకు ఎకరాలు ప్రభుత్వ భూములు, గెడ్డలు అధిక శాతం పెద్దలు, భూస్వాముల ఆక్రమణలోనే ఉన్నాయి. చాలా మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం ప్రభుత్వ భూములను కబ్జా చేసి దోచుకుంటున్నారు. ఇవన్నీ తెలిసినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటారు. కానీ ఏదో ఒక మూల పేదలు తమకు గూడు లేక ప్రభుత్వ స్థలంలో గత 40 ఏళ్లగా చిన్న చిన్న పాకలు వేసుకుంటే మాత్రం వారిపై ఒత్తిడి చేసి ఆ పాకలను పీకేసేంత వరకూ అధికారులు నిద్ర పట్టరు. కచ్చితంగా అలాంటి ఘటనే ఇప్పుడు మండలంలోని కాపుసోంపురంలో చోటుచేసుకుంది.

మండలంలోని కెల్లంపాలెం పంచాయతీ, కాపు సొంపురం నుండి దబ్బ గుంటకు వెళ్లే రహదారిలో సర్వేనెంబర్ 141లో 1.63 ఎకరాలు ప్రభుత్వ రాస్తా, పోరంబోకు భూమి ఉంది. ఇందులో ఎకరా వరకు భూస్వాములు పెద్దల అధీనంలో ఉంది. మిగిలిన 63 సెంట్లలో 40 ఏళ్లుగా ఎం నగేష్, వి. సూరిబాబు, ఎం. నాయుడు, సిహెచ్. అక్కయ్య, రాము తదితర పేద కుటుంబాలు పాకలు, షెడ్లు నిర్మించుకొని గొర్రెలు, మేకలు, గడ్డి కుప్పలు, మామిడి, కొబ్బరి వంటి వాటితో జీవనం సాగించేవారు. ఇంతలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అధికారులు ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను అన్వేషించడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో భూస్వాముల చేతిలో ఉన్న ఎకరా భూమిని వదిలేసి పేదల పాకలు వేసుకున్న 63 సెంట్లపై అధికారుల కన్నుపడింది. అక్కడ నివాసముంటున్న ఐదుగురుకూ వేరే చోట ఐదేసి సెంట్లు చొప్పున భూమికి పట్టాలిస్తామని దానికి బదులు ఇక్కడున్న ప్రభుత్వ భూమిని ఖాళీ చేయాలని అప్పటి తహశీల్దార్ రామారావు పేదలకు చెప్పారు. దీనికి అంగీకరించిన ఆ ఐదుగురు వారి చేతిలో ఉన్న భూమిని ప్రభుత్వానికి ఇచ్చారు. అక్కడే జగనన్న కాలనీకి ప్రభుత్వం ప్రతిపాదించి నిర్మాణాలకు సిద్ధమైంది. ఇదంతా జరిగి మూడేళ్లవుతుంది. కానీ ఇంత వరకూ ఆ రైతులకు వేరే చోట తహశీల్దార్ ఇస్తామన్న భూ హక్కు పత్రాలను వారికి ఇవ్వలేదు. దీంతో వారు అక్కడ జరుగుతున్న జగనన్న నిర్మాణాలను అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల అధికారులు వేరే గ్రామాలకు చెందిన వారికి కూడా ఇక్కడ స్థలాలు ఇచ్చేందుకు సిద్ధం కావడంతో బాధితులు అడ్డుకున్నారు. తమకు ఇస్తామన్న స్థలాలను ఇవ్వకపోగా వేరే గ్రామాలకు చెందిన వారికి కూడా ఇక్కడే స్థలాలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. తమకు భూ హక్కు పత్రాలు ఇచ్చిన తరువాత నిర్మాణాలు చేపట్టాలని కోరారు. తహశీల్దార్ రామారావు బదిలీపై వెళ్లిపోయారని కొత్త తహశీల్దార్ వచ్చారని ఆయనకు చెప్పుకోవాలని అధికారులు బాధితులకు చెప్పినట్లు తెలిస్తోంది.

రెవెన్యూ సిబ్బందిని నిలదీస్తున్న బాధితులు

మాకు న్యాయం చేయండి

నా భర్త పక్షవాతంతో మరణించాడు. నేను మేకలు, గొర్రెలను మేపుకుంటూ కుటుంబానికి అండగా ఉంటున్నాను. అధికారులు, నాయకులు మాలాంటి పేదల కోసం ఆలోచించి న్యాయం చేయండి. తహశీల్దార్ మాకిస్తామన్న ఐదు సెంట్లు భూమికి హక్కు పత్రాలను ఇప్పించాలి.

వి దేవుడమ్మ, కాపు సోంపురం

ఎల్‌పిసిల కోసం రిపోర్టు పంపిస్తాం

జగనన్న ఇళ్ల స్థలాల పంపిణీ కోసం భూమిని తీసుకున్న మాట వాస్తవమే. కానీ వారికి గతంలో ఇస్తామన్న భూమిని ఇదివరకే చూపించాం. ఆ భూమి కొరకే పత్రాలు ఎల్‌పిసిల కోసం రిపోర్టు పంపిస్తాను. కానీ ఇళ్ల నిర్మాణాన్ని అడ్డుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

శ్రీనివాసరావు, తహశీల్దార్, శృంగవరపుకోట

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని పిరిడి గోకుల్ గ్రూప్ అఫ్ ఇనిస్టిట్యూట్‌లో మాదక ద్రవ్యాల వాడకానికి వ్యతిరేకంగా గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్‌పి అస్మా పర్వీన్ హాజరై మాట్లాడారు. మాదకద్రవ్యాల వాడకం, వినియోగం వల్ల కలిగే నష్టాలను, అనారోగ్య సమస్యలను ఆర్థిక పరిస్థితులను విద్యార్థులకు వివరించారు. మాదక ద్రవ్యాలు మత్తు జీవితాన్ని ఏ విధంగా చిత్తు చేస్తుందో తెలిపారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన యువతలో నేరప్రవృత్తి అనేది ఏవిధంగా ఏర్పడుతుందో మాదర ద్రవ్యాల నుంచి ఏ విధంగా బయటపడాలో సూచించారు. ఇప్పటికే మాదకద్రవ్యాలకు అలవాటు పడిన యువతను తల్లిదండ్రులు కాలేజీ యాజమాన్యాలు గుర్తించి అటువంటి వారి గురించి టోల్ ఫ్రీ నెంబర్ 14500కు సమాచారం తెలపాలన్నారు. ఈ కార్యక్రమం లో గోకుల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, ఇతర అధ్యాపకులు, ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎఎస్‌పి పర్వీన్

మూడు మండలాల మహిళా పోలీసులతో సమావేశం

బొబ్బిలి స్టేషన్ పరిధిలో గల తెర్లాం, బాడంగి, రామభద్రపురం మండలాల మహిళా పోలీసులతో ఎస్ఇబి స్టేషన్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. మాదక ద్రవ్యాల పైనా, నాటుసారా, అక్రమ మద్యం మీద ప్రత్యేక దృష్టి సారించాలని చెపాప్రు. ఎస్ఇబి అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సమాచారం అందించాలని తెలియజేశారు. గ్రామాలలో మహిళల సమస్యలను ఎప్పటికప్పుడు పోలీస్‌లకు తెలియజేయాలని బాలికలకు, మహిళ లకు సంబంధించిన కౌన్సిలింగ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. మహిళా పోలీసులకు విధి నిర్వహణలో తగు సలహాలు సూచనలు అందించారు. ఈ సమావేశంలో ఎస్ఇబి సిఐ జైభీమ్ పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' జయప్రదం చేయండి

ప్రజాశక్తి- మెంటాడ

వచ్చేనెల 5వ తేదిన నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బుద్దరాజు రాంబాబు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన చట్టాలను అమలుచేయాలని, ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి నిధులు కేటాయించాలని, గ్రీన్‌ఫీల్డ్ రహదారి భూసేకరణ విషయంలో రైతులకు నాలుగు రెట్లు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు పూర్తి బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, కౌలు రైతులకు అన్నివిధాలా పథకాలు వర్తింపు చేయాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటు కరణను నిలుపుదల చేయాలని, 60సంవత్సరాలు దాటిన రైతులకు 5వేల రూపాయలు ఫించన్ అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రాకోటి రాములు, మండల గిరిజన సంఘం మండల కార్యదర్శి తామారాపల్లి సోములు తదితరులు పాల్గొన్నారు.

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

వ్యాసరచన మెళకువలపై సదస్సు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

గురజాడ అప్పారావు నుండి వ్యాసపదం విరివిగా వ్యవహారంలోకి వచ్చిందని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ హెచ్ఒడి ఆచార్య వెలిదండ నిత్యానంద రావు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో గురువారం 'వ్యాసరచన మెళుకువలు' అను అంశంపై నిర్వహించిన జాతీయ అంతర్జాల సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస లక్షణాలు, వ్యాస రచనా పద్ధతులు, వ్యాస రకాల గురించి కూలంకుషంగా వివరించారు. ఆంగ్ల భాష ప్రక్రియ ఐన ఎస్ఎ నుంచి తెలుగులోకి వచ్చిన వ్యాసాన్ని మొదట ప్రమేయం అని సామినేని ముద్దు నరసింహం పిలిచేవారని, గురజాడ అప్పారావు నుంచి వ్యాస పదం విరివిగా వ్యవహారం లోకి వచ్చిందని, వ్యాస రచనకు ఎత్తుగడ, శీర్షిక పేరు, వినూత్నమైన అంశం, ఒక కొత్త చూపు, స్పష్టత చాలా ముఖ్యమని, అందరూ రాసే వ్యాసాల్లా కాక శ్రీశ్రీ హాస్యం, చమత్కార విశ్వనాథ వంటి వినూత్న వ్యాసాలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యక్షురాలు రేచర్ల శ్రీలక్ష్మీ, నిత్యానందరావు రచించిన 'విశ్వవిద్యాలయాలలో తెలుగు పరిశోధన' పుస్తకం పిహెచ్‌డి పరిశోధకులకు కరదీపిక వంటిదని, నిత్యానుశీలనం, హాసవిలాసం, అనుభూతి అన్వేషణ మొదలు ఆదర్శపథం వరకు 7 సంపుటాలుగా వారి రచనలు చేసిన వ్యాస బ్రహ్మ నిత్యానందులని కీర్తించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ రమేష్ కుమార్, డాక్టర్ సివియస్ రవీంద్రనాథ్, అద్యాపకులు వాసుదేవరావు, ఈరన్న, భాస్కర్‌రావు, శ్రీనివాసరావు, సంధ్యారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూములివ్వాలి

ప్రజాశక్తి- మెంటాడ

కబ్జాదారుల వద్దనున్న భూములను నిరుపేదలకు ఇవ్వాలని గురువారం మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలురైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాములు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా డీపట్టా, సీలింగ్ భూములలో సాగులోవున్న నిరుపేదల భూములను కబ్జాదారులు చేతిలో వున్నాయన్నారు. రెవెన్యూ అధికారుల మద్దతితో కబ్జాదారులు తమగుప్పిట్లో వున్నాయని రాములు ఆరోపించారు. ఆయా భూములను భూకబ్జా దారులు నుంచి నిరుపేదలకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఇప్పటికే నివేదిక అందించినా పట్టించుకోలేదని ఇప్పటికైనా స్పందించకపోతే ఉన్నతాధికారులకు నివేదిస్తామని హెచ్చరించారు. అనంతరం మండల డిప్యూటీ తహశీల్దార్ వెంకటరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి తామారాపల్లి సోములు, పంచాలి రాములమ్మ, పెరుమాళ్ వీరమ్మ, గుమడాపు అప్పలస్వామి, గుమడాపు ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరంలో ట్రాఫిక్ జామ్

గజపతినగరం : గజపతి నగరంలో గురువారం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పార్వతీపురం నుండి విశాఖ పట్నం వెళ్తున్న అల్ట్రా డీలక్స్ ఎపిఎస్ ఆర్‌టిసి బస్సు స్థానిక పోలీస్ స్టేషన్ దగ్గరలో సాంకేతిక లోపంతో ఆగిపోవడం వల్ల సుమారు గంటపాటు ట్రాఫిక్ అంతరా యం ఏర్పడింది. రోడ్డు నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఇప్పటికే వన్ వే రహదారిలా మారిన రోడ్డులో బస్సు ఆగిపోవడం మరింత ఇబ్బందిని కలిగించింది. వాహనదా రులు తీవ్ర ఇకట్లుకు గురయ్యారు. స్థానిక ఎస్.ఐ గంగరాజు చొరవతో పోలీస్ సిబ్బందితో ట్రాఫిక్ క్లియర్ చేశారు. తరచూ ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు.

రోడ్డు మధ్యలో నిలిచిపోయిన ఆర్‌టిసి బస్సులు

క్షయ నివారణపై అవగాహన

కొత్తవలస : టిబి రహిత సమాజాన్ని తయారు చేయడానికి అందరం సిద్ధం కావాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ గోపాల్ కృష్ణ అన్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల స్కూల్, రామలింగాపురంలో గురువారం క్షయ వ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిబి రహిత సమాజాన్ని తయారు చేయాలన్నారు. రెండు వారాలు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మంద గించడం, కఫం ద్వారా రక్తపు జీరలు పడటం, ఛాతిలో నొప్పి ఉంటే దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కఫం పరీక్ష చేయించు కోవాలని తెలిపారు. టిబి అంటువ్యాధి అని, దగ్గినపుడు, తుమ్మినపుడు గాలి తుంపరలు ద్వారా ఒకరి నుండి మరొకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. దుమ్ము, ధూళి ప్రదేశాలలో పని చేసే వారికీ, ధూమపానం, మద్యపానం చేసే వారికీ, గుట్కా, ఖైనీ, సేవించే వారికి, రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారికీ టిబి వ్యాధి సోకుతుందని తెలిపారు. అన్నీ ప్రభుత్వ ఆసుపత్రి లో ఉచితంగా మందులు దొరుకుతాయని చెప్పారు. టిబి మందులు వాడిన ఆరు నెలలు రోగికి ప్రభుత్వం పౌష్టికహారం నిమిత్తం నెలకు రూ. 500 బ్యాంకు అకౌంట్‌లో వేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ప్రిన్సిపాల్ టి. జయశ్రీ, హెల్త్ సూపర్‌వైజర్ రాము, ఎమ్‌పిహెచ్ఇఒ గోవిందరాజు, హెచ్‌వి పద్మావతి, గీతిక, స్టాఫ్ నర్స్ శ్రీదేవి, ఏ.ఎన్.ఎమ్ భవాని, వరలక్ష్మి ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

చెరకు ట్రాక్టర్ బోల్తా

రేగిడి: మండలంలోని కొమిరి పంచాయతీ పరిధి మంగళపేట మలుపు వద్ద గురువారం చెరకు ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. నిత్యం రద్దీగా ఉండే ఆ ప్రదేశంలో ఒక్కసారిగా చెరకు ట్రాక్టరు బోల్తాపడటంతో అక్కడ ఉన్న వారు పరుగులు తీసి ఊపిరి పీల్చుకున్నారు. అధిక చెరకు లోడుతో సంకిలి షుగర్ ఫ్యాక్టరీకి తరలించడంతో ఒక్కసారిగా మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది.

గ్రామ పంచాయతీ కొండపాలెం

వేలం కం టెండరు నోటీసు

రేఖా నెం. 14 /2023 తేది. 23-03-2023

విజయనగరం జిల్లా, గరివిడి మండలం, కొండపాలెం (గరివిడి) గ్రామ పంచాయతీకి చెందిన ఈ దిగువ వ్రాయబడిన 2023-2024 సంవత్సరమునకు వేలం మరియు టెండర్లు ద్వారా గుత్తకిచ్చుటకు తే.29-03-2023ది. వరకు టెండర్లు స్వీకరించబడును మరియు 11:00 గంటల నుండి 1:00 గంట (ఒంటిగంట) వరకు ఈ దిగువ సంతకందారునిచే వారి అనుమతి పొందిన వారిచే గాని గ్రామపంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం వేయబడును. వేలంపాట మరియు టెండర్లులలో పాల్గొనదలచినవారు ఆయా గంటలకు ఈ క్రింది విధంగా చూపబడిన ధరావతులు ముందుగా చెల్లించి వేలం మరియు టెండర్లులలో పాల్గొనవలెను మరియు సాల్వెన్సీ సర్టిఫికెట్లు ముందుగా దాఖలు చేయవలెను. వేలం నిబంధనలను పాటించి వేలం మరియు టెండర్లలో పాల్గొనవలెను.

వ.సం	వేలం వివరములు	లీజు కాలం	ధరావత్తు	సాల్వెన్సీ విలువ
1.	రోజు వారి మార్కెట్లు	2023-2024	10,000/-	50,000/-
2.	కార్టు స్టాండ్ (నాటు బండి మాత్రమే)	2023-2024	2000/-	50,000/-
3.	కంపోస్టు	2023-2024	100/-	5,000/-
4.	పాత దినపత్రికలు	2023-2024	100/-	5,000/-

టెండర్లు :
1) 28 మంది కాంట్రాక్ట్ స్వీపర్లును సప్లైయి చేయుటకు 2023-2024 రూ.5000/-
2) 10 మంది మంచినీటి పని వారును సప్లైయి చేయుటకు 2023-2024 రూ.1000/-
3) వీధిలైట్లు బాగు చేయుటకు, స్తంభం ఎక్కి కట్టుటకు (01) ఒక్కరిని సప్లైయి చేయుటకు గాను 2023 2024 రూ. 500/-
4) పారిశుద్ధ్య పు ట్రాక్టరు నడుపుటకు (03) ముగ్గురు సప్లైయి చేయుటకు 2023 2024 రూ. 500/-
5) ప్రజారోగ్య సిబ్బందికి సబ్బులు, కొబ్బరి నూనె సప్లైయి చేయుటకు 2023-2024 రూ. 200/-
6) ప్రజారోగ్య సామానులు మరియు మందులు సప్లైయి చేయుటకు 2023-2024 రూ. 1000/-
7) గార్బేజ్ వ్యాన్లుకు (తడి చెత్త & పొడి చెత్త) ఇద్దరును సప్లయి చేయుటకు గాను 2023- 2024 రూ. 5000/-

పై వాటిని సప్లైయి చేయుటకు వేలం వేసిన తేదీ 29-03-2023 వరకు ఈ దిగువ సంతకం చేసిన వారిచే గాని వారి అనుమతి పొందిన వారిచే గాని తీసుకోగలరు. అదే రోజు సాయంత్రం 04-30 గంటలకు రాని టెండరు ధరావత్తు చెల్లించని టెండర్లు నిరాకరించబడును. ఇతర వివరముల కొరకు కార్యాలయంలో సంప్రదించగలరు.

షరతులు: 1) టెండర్లులలో ఒకటవ ఐటమ్ 28 మంది కాంట్రాక్టు స్వీపర్లకు కొబ్బరి నూనె, సబ్బులు - సదరు తక్కువ రేటు గల టెండరు దారుడు సప్లైయి చేయవలెను.

గమనిక : 1) వేలములు, టెండర్లు ఏ విధమైన కారణం చేత రద్దు పరిచే అధికారం ఈ గ్రామ పంచాయతీ వారికి కలదు
2) ఏ విధమైన విషయమైనా గ్రామపంచాయతీ పని వేళల్లో మాత్రమే తెలుసుకోగలరు.
3) శ్రీ కలెక్టర్ సం,, విభాగం వారి ఉత్తర్వులు లోబడి

సర్పంచ్
గ్రామ పంచాయతీ కొండపాలెం

పంచాయతీ కార్యదర్శి
గ్రామ పంచాయతీ కొండపాలెం.

HIGH COURT OF ANDHRA PRADESH AT :: AMARAVATHI

AS.NO. 134/2022

Between :
Smt.D.Lakshmi Devi ....APPELLANT
AND
Uppalapati Padmanabha Raju & others ....RESPONDENTS

To
1) Smt.Dantuluri Rohini D/o Late. Lakshmipathi Raju, R/o Kowada (village) West Godavari Dist.,- 534 202.
2) Smt.Dantuluri Indira D/o Late. Lakshmipathi Raju, R/o Avanam (village) Bhogapuram (Mandal) - 535 216 Vizianagaram Dist.,

Madam

My client Smt. D.Lakshmi Devi filed AS.No.134/2022 on the file of Hon'ble High Court of Andhra Pradesh at Amaravathi against Judgment and Decree Dt.19.07.2016 in OS.No.206/2007 on the file of court of XIII Addl.District Judge, Gajuwaka. You arrayed as respondent Nos.5 and 6 in the said appeal. The said appeal is now stands posted to **19.04.2023** for your appearance either in person or through advocate on that day at **10.30** AM, failing which, the appeal would be decided in your absence.

(BY ORDERS OF HONOURABLE HIGH COURT)

Sd/- **G. PADMAVATHI SRINIVAS**
COUNSEL FOR APPELLANT
HIG-463, HOUSING BOARD COLONY,
NEAR.CHURCH CENTRE,
BHAVANIPURAM
VIJAYAWADA
PHONE: 7032870159